అసెంబ్లీలో సీఎంను కలిసిన ఏఎంసీ చైర్మన్

● కోహెడ మార్కెట్ పరిపాలన అనుమతులపై చర్చ



కోహెడ మార్కెట్‌కు సంబంధించి డీపీఆర్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోహెడ మార్కెట్ విషయంపై సీఎంతో వారు చర్చించారు. దీంతో స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి సంబంధింత అధికారులను పిలిచి మార్కెట్ పరిపాలన అనుమతులను వేగవంతం చేయాలని, త్వరలోనే మార్కెట్ ప్రాజెక్ట్‌పై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కోహెడలో ఏర్పాటు చేయబోయే సమీకృత మార్కెట్ దేశంలోనే ఆదర్శంగా ఉండేలా చూడాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్‌రావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీని సద్వినియోగం చేసుకోండి : కమిషనర్

అబ్దుల్లాపూర్‌మెట్ : 2024-2025 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వడ్డీపై ప్రభుత్వం కల్పించిన 90శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ ఈ నెలాఖరు వరకు మాత్రమే ఉంటుందన్నారు. ఒకేసారి ఆస్తిపన్ను మొత్తం చెల్లించిన వారికి ఈ రాయితీ లభిస్తుందన్నారు. పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పార్కుల్లో సమస్యలను పరిష్కరిస్తా : రాగుల



పార్కులో వాకర్స్ నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం : పార్కుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం వనస్థలిపురం రైతుబజార్ వెనుకాల ఉన్న పార్కును కార్పొరేటర్ సందర్శించి వాకర్స్ నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్కుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి: కార్పొరేటర్



శుభోదయకాలనీలో మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అధికారులను కోరారు. చంపాపేట డివిజన్‌లోని శుభోదయకాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.1.78లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కర్మన్‌ఘాట్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయం నుంచి వైయస్సార్ విగ్రహం వరకు త్వరలో స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. శుభోదయ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరం ఉన్న చోట్ల యూజీడీ లైన్ల మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ శేఖర్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, చీర గణేష్, పాముల మల్లేష్, శ్రీధర్‌రగౌడ్, వేణుగౌడ్, కాలనీ ప్రతినిధులు సునిల్, శ్రీశైలం, నరేందర్, శివ పాల్గొన్నారు.



జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల నేతలు

ఎమ్మెల్యేపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

చంపాపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌పై ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఢిల్లీలోని లోక్‌నాయక్‌భవన్‌లో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్‌కు పలు గిరిజన సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్‌చౌహాన్, గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ అశోక్‌రాథోడ్, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్‌పతినాయక్, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్, భరత్‌నాయక్ పాల్గొన్నారు.

ఖైదీలు జైలు జీవితాన్ని గుణపాఠంగా తీసుకోవాలి



ఖైదీల బాగోగులు తెలుసుకుంటున్న టీఎస్ఎల్ఎస్ఏ సభ్య కార్యదర్శి పంచాక్షరీ

సైదాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఖైదీలు జైలు జీవితాన్ని గుణపాఠంగా తీసుకుని సత్ప్రవర్తనతో సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ(టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి సీహెచ్. పంచాక్షరీ అన్నారు. గురువారం చంచల్‌గూడ మహిళా జైలును టీఎస్ఎల్ఎస్ఏ పరిపాలనాధికారి, సీనియర్ సివిల్ జడ్జి కళార్చనతో కలిసి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. జైలు నిర్వహణ, వసతులను వారు స్వయంగా పరిశీలించి ఖైదీలతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. జీవితంలో అనూహ్యంగా సంభవించే సంఘటనల కారణంగానే క్షణికావేశంతో నేరాలు చేసి ఖైదీలుగా మారిపోతున్నారని, ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా మున్ముందు క్రమశిక్షణతో మెలుగుతూ మానసిక పరివర్తనతో ఉన్నత జీవనం సాగించాలని అన్నారు. పేదలకు అందిస్తున్న ప్రభుత్వ న్యాయ సహాయాన్ని ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ టి. వెంకటలక్ష్మీశ్రీనాథ్, డిప్యూటీ జైలర్లు విజయ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో రోడ్డు కబ్జాపై అధికారులకు ఫిర్యాదు

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 23వ డివిజన్‌లోని లక్ష్మీనగర్‌కాలనీలో ఓ ప్లాటు యజమాని 20 అడుగుల రోడ్డును కబ్జాచేసి స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాడని అల్మాస్‌గూడకు చెం దిన సీనియర్ సిటిజెన్ చప్పిడి రాంరెడ్డి గురువారం బడంగ్‌పేట్ మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి సదరు కబ్జాను అడ్డుకుని రోడ్డును వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోతే హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు.

పాతబస్తీలో పన్నులు వసూలు చేసే ధైర్యం ఉందా..?!

● మీర్‌పేట్‌లో అధిక పన్నుల భారం ఎందుకు?
● తగ్గించకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం
● బీజేపీ రాష్ట్ర నేత శ్రీరాములుయాదవ్ హెచ్చరిక



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాత బస్తీలో పన్నులు వసూలు చేసే ధైర్యం లేని కాంగ్రెస్ ప్రభుత్వం.. మీర్‌పేట్‌లో మాత్రం ప్రజలపై పన్నుల భారం మోపి ఇబ్బందులకు గురి చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ఆరోపించారు. సర్కార్‌కు దమ్ముంటే పాత బస్తీలో రెగ్యులర్ పన్నులతో పాటు పాత బకాయిలు సైతం వసూలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీలో లేని విధంగా మీర్‌పేట్‌లో ఆస్తిపన్ను విధించడం ఎంత వరకు సమంజసమని ఆయన నిలదీశారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లో అధిక పన్నులకు నిరసనగా బీజేపీ క్లస్టర్-12 అధ్యక్షులు పి.భిక్షపతిచారి, టి.ముఖేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల రిలే నిరాహార దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీరాములుయాదవ్, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ మీర్‌పేట్‌లో దాదాపు 70శాతం మంది పేద, మధ్య తరగతి ప్రజలే ఉన్నారని, వారిపై ప్రభుత్వం అధిక పన్నుల భారం వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆయన ఆరోపించారు. నగరంలోని పాత బస్తీలో రూ.కోట్లలో పన్ను బకాయిలు పేరుకుపోయాయని, వాటిని వసూలు చేసే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉన్నదా? అని ఆయన ప్రశ్నించారు. పాతబస్తీ వైపు చూసే ధైర్యం లేని ప్రభుత్వం సామాన్యులు నివసించే మీర్‌పేట్‌లో మాత్రం తన ప్రతాపాన్ని చూపుతున్నదని, ఇక్కడి ప్రజలను పన్నుల భారంతో ఇబ్బందుల పాలు చేస్తున్నదని అందెల ధ్వజమెత్తారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధిక పన్నులపై ఆందోళనలు చేసిందని, ఇప్పుడు అధకారంలోకి రాగానే సమస్యను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి ఇక్కడి ప్రజలపై నిజంగా ప్రేమ ఉంటే అధిక పన్నులపై ప్రజల పక్షాన రోడ్డెక్కి నిరసనలు తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. మీర్‌పేట్‌లో పన్నుల భారం తగ్గించేదాకా తమ పార్టీ విశ్రమించబోదని, రోజుకో విధంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుందని శ్రీరాములుయాదవ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, సబితారాజశేఖర్‌రెడ్డి, ఇంద్రావత్ రవినాయక్, కీసరి హరినాథ్‌రెడ్డి, జమునాకృష్ణారెడ్డి, మొదల బాలకృష్ణ, భీమ్‌రాజ్, గౌరీశంకర్, జిల్లెల అరుణా ప్రభాకర్‌రెడ్డి, యెద్ల మల్లేశ్‌ముదిరాజ్, కె.విజయలక్ష్మీరాజు, పార్టీ నాయకులు కె.సోమేశ్వర్, గాజుల మధు, సూల ప్రభాకర్, చింతల రాఘవేందర్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో డ్రగ్స్, గంజాయి స్వాధీనం

● ఐదుగురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగడ్డ, ధూల్‌పేట్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.78 గ్రాముల ఎండీఎంఏ, 1.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్ బృందం నిఘా పెట్టింది. ఎండీఎంఏ విక్రయించేందుకు వచ్చిన ఎస్‌కే మహ్మద్ రహీం, మహ్మద్ ఫక్రుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు మొబైల్‌ఫోన్లు, 2.73 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. వీరికి ఎండీఎంఏ సరఫరా చేస్తున్న బెంగళూరుకు చెందిన ఇబ్రహీం జహీర్, సౌదీకి చెందిన సఫాన్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మరో కేసులో లోయర్ ధూల్‌పేట్ ఝంగూర్ బస్తీలో గం జాయి విక్రయిస్తున్న కునాల్ సింగ్, వినోద్‌సింగ్, హేమబాయిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 1.30 కిలోల గంజాయి, 4 మొబైల్ ఫోన్లు, యాక్టీవా వాహనం స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి దందాలో సహకరిస్తున్న అనికేష్‌సింగ్, ఆర్తిబాయి, నరేష్, గణేష్ పరారీలో ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

రామోజీ ఫిల్మిసిటీ ఆక్రమించిన భూములను పేదలకు పంచాలి : సీపీఎం

హయత్‌నగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఎం కార్యకర్తలపైన పోలీసుల నిర్బంధ కాండను వ్యతిరేకిస్తూ గురువారం తుర్కయంజాల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ మాట్లాడుతూ నాగన్‌పల్లి, పొల్కంపల్లి, రాయపోల్, ఏనుగులగూడ, ముకునూరు గ్రామాల్లోని ప్రభు త్వ భూదాన భూముల్లో గత ప్రభుత్వాలు సుమారు 600 మంది పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేదల స్థలాలను ఆక్రమణ నుంచి విడిపించి తిరిగి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆశీర్వాదం, సత్యనారాయణ, మాల్యాద్రి, శ్రీనివాసులు, కృష్ణ, శంకరయ్య, మాధవరెడ్డి, యాదయ్య, యాదగిరి, హనుమంతరెడ్డి, ధర్మారెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

అబ్దుల్లాపూర్‌మెట్ : అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం అని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామోజీ ఫిల్మ్‌సిటీ ఆక్రమణలో ఉన్న పేదల ఇందిరమ్మ ఇళ్ల స్థలాల వద్దకు లబ్ధిదారులు వెళ్లకుండా అరెస్టుచేసి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో గుండె శివకుమార్, ముత్యాలు, శ్రీనివాస్, ప్రయణ్, శివశంకర్ పాల్గొన్నారు.



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

ఘనంగా ఈదమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

సైదాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఐఎస్ సదన్ డివిజన్ దామోదరం సంజీవయ్య నగర్(డీఎస్‌నగర్)లోని శ్రీ ఈదమ్మ అమ్మవారి ఆలయ పంచమ వార్షికోత్సం గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం దాకా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకుని ఆలయ పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి దంపతులు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వరికుప్పల యాదయ్య, బలరాం, కాశీరాములు, కృష్ణ, గోవింద్, ఈదయ్య, బక్కయ్య, బాలయ్య, రాములు, బస్తీవాసులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడి

సైదాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రేమిస్తున్నానని, పెళ్లిచేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాబాద్‌కు చెందిన ఓ యువతి, కాలికబర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి హర్షకుమార్(24) ఇద్దరు క్లాస్‌మెట్స్. ఇద్దరి మధ్య కొన్నేళ్లుగా ఉన్న స్నేహం ప్రేమకు దారితీసింది. యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ రూమ్‌కు తీసుకువెళ్లి లైంగిక దాడి చేశాడు. ఇటీవల ఆ యువతి తనను పెళ్లి చేసుకోవాలని కోరగా అతడు మొఖం చాటేస్తూ పెళ్లికి నిరాకరించాడు. దీంతో సదరు యువతి సైదాబాద్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఏడాదిన్నర శిక్ష

హయత్‌నగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో ఆటో నడిపి గర్భిణీని ఢీకొట్టిన సంఘటనలో గర్భిణీ, ఆమె కడుపులో ఉన్న శిశువు మృతికి కారణమైన నిందితుడిని ఎల్బీనగర్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కోర్టు దోషిగా నిర్ధారించింది. నిందితుడికి ఏడాదిన్నర కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి..

2017 సంవత్సరంలో కుంట్లూరుకు చెందిన ఓరుగంటి సుభాష్(43) తాగిన మైకంలో ఆటో నడిపి హయత్‌నగర్‌లో రోడ్డు దాటుతున్న గర్భిణీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన గర్భిణీ, ఆమె కడుపులో ఉన్న శిశువు చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2018 సంవత్సరంలో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా గురువారం ఎల్బీనగర్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జ్ కోర్టు తీర్పునిచ్చింది. బాధితురాలు తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ బీనా వాదనలు వినిపించారు.

ఘనంగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మన్సూరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : మన్సూరాబాద్ డివిజన్ చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో బుధవారం రాత్రి శ్రీవైష్ణవ సేవా సంఘం, ఎస్వీఎస్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వాములు విచ్చేసి శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పంచాంగాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉగాది పురస్కార గ్రహీతలైన ఉభయ వేదాంత పండితులు నేపాల్ కృష్ణమాచార్య స్వామి, భట్టర్ సుకుమారాచార్యులు, పాంచరాత్ర ఆగమ పండితులు మంగళగిరి యాదగిరిస్వామి, అర్చకులు భట్టర్ సురేంద్రాచార్యులు, సంస్కృత పండితులు శ్రీరంగాచార్యులతో పాటు శతాధిక వృద్ధురాలు శృంగారం ఆండాలమ్మను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలో భాగంగా సంఘం సాంస్కృతిక సలహాదారుడు కె.రామాచార్యులు తన గాత్రంతో ఆకట్టుకున్నారు. శ్రీవైష్ణవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శృంగారం తిరువేంగలాచార్యులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారుడు డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచార్యులు, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, వీహెచ్‌పీ కేంద్ర అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, పాండురంగాచార్యులు, సుదర్శనాచార్యులు, అంబారిపేట వెంకటలక్ష్మీనర్సింహాచార్యులు, సముద్రాల బద్రీనాథ్, వేణు, రమాదేవి, మాధవిలత, శ్రావణి పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం

చంపాపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ సాగర్‌రోడ్డులోని సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్‌స్కూల్‌లో గురువారం మాంటిస్సోరి విద్యార్థులకు కాన్వకేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జున విద్యాసంస్థల చైర్‌పర్సన్ గుమ్మకొండ రజనీ విఠల్‌రెడ్డి హాజరై విద్యార్థులకు క్యాప్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చిన్నారులు నల్లగౌనులతో విశేషంగా ఆకట్టుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా రజనీ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు పాఠశాల పట్ల మక్కువ పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయకుమార్‌రావు, ఇన్‌చార్జీలు సవిత, పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక, ఉష్రశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు పంచాంగ శ్రవణం

వనస్థలిపురం : వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో ఈనెల 29న వనస్థలిపురం రెడ్ ట్యాంక్ సమీపంలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ దేవులపల్లి పవనకుమార సిద్ధాంతిచే పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షుడు సీహెచ్.వీ.ఆర్.కే మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఉగాది పంచాగ శ్రవణంలో కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో నాగబ్రహ్మాచారి

హయత్‌నగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జలమండలి సౌజన్యంతో సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం హయత్‌నగర్ జిల్లా ప రిషత్ పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించి నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలమండలి హయత్‌నగర్ డివిజన్ ఏఈ రాజు హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టడంలో విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. నీటి సంరక్షణ చర్యల గురించి తల్లిదండ్రులకు, పక్కింటి వారికి తెలియజేయాలని కోరారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంట ఉండేవిధంగా కుటుంబ సభ్యులను చైతన్య పరచాలని కోరారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో ఎస్. నాగబ్రహ్మాచారి మాట్లాడుతూ మంచు పర్వతాలు కరగడం వల్ల మానవాళికి నష్టం ఏర్పడుతుందని విద్యార్థులకు తెలిపారు. అందుకే ప్రతి వర్షం చుక్క వడిసిపట్టి భూమిలోనికి ఇంకే విధంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకుడు గుంతల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని కోరారు. ఈ సందర్భంగా నీటిని సంరక్షిస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 12న వీర హనుమాన్ విజయ యాత్ర

● బడంగ్‌పేట్‌లో కరపత్రాలు ఆవిష్కరణ



యాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

సరూర్‌నగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ ప్రఖండంలోని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12వ తేదీన వీర హనుమాన్ విజయయాత్ర నిర్వహించనున్నట్టు ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. బుధవారం రాత్రి బడంగ్‌పేట్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు కళ్లెం రాజేందర్ రెడ్డి, సుధాకర్, నడికుడ యాదగిరి, రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, నవారు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొని యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైందవుల ఐక్యత, హైందవుల్లో భక్తి పరిరక్షణ నిమిత్తం ఈ యాత్ర నిర్వహించనున్నట్టు చెప్పారు. ఏప్రిల్ 12న ఉదయం 8గంటలకు కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుందని వారు తెలిపారు. హనుమాన్ భక్తులు, హిందు బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై యాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు సమరసింహారెడ్డి, నరహరి, చంద్రశేఖర్, మహేశ్‌యాదవ్, కుమార్‌గౌడ్, సంజయ్‌శర్మ పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చంపాపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని భూపేష్‌గుప్తానగర్ కాలనీలో గురువారం సాయంత్రం ముస్లింలకు ప్రభుత్వపరంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ హాజరై ముస్లింలకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, కార్తీక్ నాయక్, మమత మల్లేష్‌గౌడ్, శివారెడ్డి, ఇబ్రహీం, సయ్యద్, షాకీర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న కార్పొరేటర్ సుజాతానాయక్

ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ

ఎల్‌బీనగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కందికంటి శంకరయ్యగౌడ్, ఫౌండేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ గౌడ సంక్షేమ సంఘంలో పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం మాజీ డైరెక్టర్ బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్, కందికంటి శంకరయ్యగౌడ్, ఫౌండేషన్ నిర్వాహకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, రాజుగౌడ్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గణేష్‌నాయక్, మహ్మద్ ఖాజాబాయ్, మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.



ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, శ్రీధర్‌గౌడ్ తదితరులు



ఇఫ్తార్ విందులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీధర్‌బాబు

ఆటోనగర్‌లో ఇఫ్తార్ విందు

మన్సూరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లో హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసోసియేషన్ అధ్యక్షుడు పోకూరి శ్రీధర్‌బాబు విచ్చేసి ఇఫ్తార్ విందును ప్రారంభించి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు, కోశాధికారి కె.శంకర్, ఉపాధ్యక్షుడు ఎం.యాదగిరిరెడ్డి, యు.వెంకటేష్, సహాయ కార్యదర్శి బి.ధర్మారావు. కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ అమీద్, మోహన్‌రెడ్డి, శేషు పాల్గొన్నారు.